


# 1. గురుత్వం

పక్కింట్లోంచి హారతిగంట వినిపించడంతో రోజూలాగే మెలకువ వచ్చింది. తలతిప్పి గడియారం వైపు చూశాను. అయిదూయాభై. చిరాకుగా దుప్పటి మెడవరకూ లాక్కున్నాను.

ఇక నిద్రపట్టదు. రాత్రి పడుకునేసరికి పన్నెండయ్యింది. ప్రక్కింటి సుబ్రహ్మణ్యశర్మ గారి పుణ్యమా అని ఇలా రోజుకి ఆరుగంటలు కూడా నిద్రపోయే అవకాశం లేకుండా పోతోంది.

మొదట్లో అది పూజగంటలా వినిపించే ఓ కొత్తరకం అలారమేమో అనుకునేవాడిని.. కానీ తర్వాత తెలిసింది ఆ భార్యాభర్తలిద్దరూ నాలుగింటికే నిద్రలేస్తారని. సూర్యోదయానికి ముందే పూజ కూడా అయిపోతుందనీ.

ఆ దంపతులంటే దివ్యకి చాలా గౌరవం. రోజూ మధ్యాహ్నంపూట ఆయన లలితోపాఖ్యానమో, మరోటో చెప్తూంటారట. కాలనీలో ఆసక్తి వున్న ఆడవాళ్లందరూ అక్కడ చేరి వింటూ వుంటారట. ఆయన భార్యేమో ఏవో పద్యాలూ, పాటలూ నేర్పుతూ వుంటుందట. దివ్య కూడా హాజరవుతుంది వాటన్నిటికీ.



దివ్య గొప్పగా చెప్పిన వాళ్ళ దినచర్య విశేషాలు విని చిరాకుపడ్డాను నేను. "ఇలా పొద్దున్నే శబ్దం చేస్తే మనకి యిబ్బందిగా వుంటోందని చెప్పు వాళ్ళకి. ఒకసారి మెలకువ వస్తే మళ్ళీ నిద్రపట్టదు నాకు" అన్నాను దివ్యతో.

దివ్య వెళ్లి ఆయనతో ఏం చెప్పిందో తెలీదు కానీ ఆయన నవ్వి, "అయిదూ యాభైకి మెలకువ వస్తే మళ్లీ పడుకోవాలని ట్రై చేస్తున్నాడా!" అన్నాడట.

దివ్య వచ్చి ఆమాట నాతో చెప్పి ఒకటే నవ్వు. "సూర్యోదయం తర్వాత కూడా పడుకుంటే అనారోగ్యంటండీ. రాత్రిపూట కొంచెం త్వరగా పడుకుని ఆ టైంకి లేచేయండి రోజూ" అంటూ ఓ ఉచిత సలహా కూడా యిచ్చింది. నేను పెదాలు బిగించి నన్ను నేను కంట్రోల్ చేసుకోవలసి వచ్చింది.

ఒక అయిదు నిమిషాలు అలాగే ప్రక్క మీద దొర్లి, మెల్లగా లేచి బాల్కనీలోకి వచ్చాను. ప్రక్కింట్లోని జామచెట్టు పలుకరించింది.

సుబ్రహ్మణ్యశర్మగారు కాకుండా దివ్యకీ నాకూ గొడవ తెచ్చే మరో టాపిక్ ఈ జామచెట్టు. నేను బాల్కనీలోని కుర్చీలో కూర్చుని అక్కడినుంచి నిర్లక్ష్యంగా విసిరే ప్రతి కాగితమూ, కవరూ... ఈ చెట్టుకి తగిలి కింద పడుతుంది.

అది చూసినపుడల్లా దివ్య చిరాకుపడుతూ "మహానుభావా! డస్ట్‌బిన్ దాకా వెళ్ళలేకపోతే, వాటిని కూర్చున్నచోటే నేలమీద పెట్టండి. నేను తర్వాత పారేస్తాను. అంతేకానీ అలా చెట్టుమీదకి విసరకండి. పాపం" అంటుంది.

దివ్య చెప్పే పాపాల లిస్ట్ వింటే నాకు ఆశ్చర్యమూ, చిరాకూ కూడా. "అన్నిటికీ యింత కంట్రోల్ అయితే అసలేపనీ చేయలేం తెలుసా!" అని నేను కసురుకుంటే "ఎవరు చెప్పారు? కంట్రోల్ వున్నచోటే ఎఫిషియన్సీ వుంటుంది" అంటుంది దివ్య అక్కడినుంచి వెళ్ళిపోతూ.

నేను ఆలోచనలో పడతాను. అది ఖండించడం కష్టమయిన స్టేట్‌మెంటే.

చాలా సందర్భాలలో ఈ సూత్రం నాకు ఎదురుపడకపోలేదు. అయితే నేను ఫిజిక్స్‌లోనో.. ఇంజనీరింగ్‌లోనో గమనించిన సిద్ధాంతాన్ని దివ్య అంత అలవోకగా తనే కనుక్కున్నట్లు చెప్పేయడమే నాకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

అసలే కొరకరాని కొయ్య దివ్య. ఇంక ఈ యిల్లు కొనుక్కున్నాక శర్మగారి పుణ్యమా అని మరీ విడ్డూరమైన సిద్ధాంతాలు నేర్చుకుంటోంది. అర్థంపర్థంలేని చాదస్తాలు! ఈ కాలానికీ యిప్పటి జీవితానికీ వుపయోగపడని విషయాలు!

నేను మొహం కడుక్కునేసరికి దివ్య కాఫీ తెచ్చింది. నాకో కప్పు యిచ్చి తను మరో కప్పు తీసుకుని బాల్కనీలోని కుర్చీలో కూర్చుంది. నేను గోడమీద చేయి ఆనించి... కొద్దిగా వంగి నిలుచుని కాఫీ తాగుతూ పక్కింటి పెరడులోని చెట్లని గమనించసాగాను.

"ఏంటి చూస్తున్నారు?" అంది దివ్య వెనకనించి.

"నీ జామచెట్టు గురువుగారిని" అన్నాను నేను అల్లరిగా.

దివ్య నావైపు చురుగ్గా చూసింది. లేచి నా దగ్గరికి వస్తూ.. "ఎగతాళిగా అన్నా సరిగ్గానే అన్నారులెండి. ఈ జామచెట్టు కూడా గురువే నాకు" అంది దానివైపు మురిపెంగా చూస్తూ.

"నువ్వు అంతగా ఆరాధించడానికి ఏముంది అందులో! నాలుగు కొమ్మలూ, నాలుగు ఆకులూ... మన దొడ్లో పెరిగిన పిచ్చి మొక్కలకీ... దీనికీ తేడా ఏమీ కనిపించడం లేదు నాకు" అన్నాను.

దివ్య నావైపు చిత్రంగా చూసింది. మా యింట్లో అడ్డదిడ్డంగా పెరిగిన పిచ్చిమొక్కలనీ, శర్మగారి పెరట్లోని చెట్లనీ మార్చిమార్చి చూసి...... "ఇక్కడినుంచి చూస్తే అలాగే అనిపిస్తుంది లెండి" అంది.

కాఫీకప్పులు తీసుకుని వెళ్ళిపోతున్న దివ్యవైపు నేనూ అంతే చిత్రంగా చూశాను. నిజంగానే నాకు తన ధోరణి అర్థం కాలేదు. ఈ జామచెట్టులో అంతగా ఆరాధించాల్సింది ఏముంది?

ఈ చెట్టుని రోజూ గమనిస్తాను నేను. బాల్కనీకి కొంచెం క్రిందుగా కనిపించే ఆ చెట్టు పైభాగం.. దాని కొమ్మలు. ఒక ఆకుపచ్చ వృత్తం. మధ్యమధ్యలో ఖాళీలు... చిల్లులయినా సరిగా లేని జల్లెడని చూసినట్లుంటుంది నాకు. అంతే. అంతకన్నా అందులో నాకు ఉపయోగపడేది కానీ... నన్ను ఆనందపరిచేదికానీ ఏమీ లేదు. మరి దివ్యకేం కనబడుతుందో ఈ చెట్టులో!

శర్మగారు భారతం కాబోలు చదువుతున్నారు. ఒక అయిదుగురు పెద్దవాళ్ళు... ఆయన వయసువాళ్ళే కూర్చుని వింటున్నారు. రోజూ ఈ టైమ్‌లో ఈ ప్రవచనం వుండదు. ఇవాళ కొత్తగా మొదలుపెట్టారు కాబోలు!

గంభీరంగా వినిపిస్తున్న ఆయన స్వరం నన్ను ఆకర్షిస్తుంటే... చేతిలోకి తీసుకున్న న్యూస్‌పేపర్ పక్కనపెట్టి ఆయన మాటలు వినడం మొదలుపెట్టాను.

అరణ్యపర్వంట. ధర్మరాజుతో శౌనకుడు బాధలు ఎన్నిరకాలో చెప్తున్నాడట. శారీరకం, మానసికం. శారీరకమైనవి మళ్లీ నాలుగు రకాలు – వ్యాధి, శ్రమ, అనిష్టస్పర్శ, యిష్టమైనది దూరమవడం. ఒక్కొక్క శారీరక బాధని ఒక్కొక్క రకమైన పరిష్కారంతో నయం చేసుకుంటామట. మానసికమైన బాధకి పరిష్కారం మాత్రం వివేకజ్ఞానమట.

ఇదేదో బాగుందే అనిపించింది నాకు. నిజంగానే ఆయన గొంతూ, చెప్పే విధానం చాలా బాగుంది. అందుకేనేమో దివ్యకి ఆయన అంటే అంత ఆరాధన!

శారీరక బాధలకి ఆయన చెప్పిన నాలుగు కారణాలూ మననం చేసుకుంటూ నేను లేచి నిలబడ్డాను. ఆయనంటే రిటైరైపోయిన ముసలాయన. ఆయనలాగా పొద్దున్నే భారతం చదువుతూ కూర్చుంటే నా కెరీర్ ఏమవాలి? రెడీ అయ్యి ఆఫీసుకి బయల్దేరాను.

పదిగంటలకి మొదటి మీటింగ్. సుబ్బు కాల్ చేశాడు. ప్రాజెక్ట్ మేనేజర్లందరినీ కూర్చోబెట్టి తన ప్రాజెక్ట్‌లో ప్రవేశపెట్టిన ఓ కొత్త ప్రాసెస్‌ని వివరించి... దానివల్ల డిఫెక్ట్స్ ఎంత గణనీయంగా తగ్గాయో చెప్తున్నాడు.

అతను ఎంత బాగా చెప్తున్నప్పటికీ అవి అతిశయోక్తులని అక్కడున్న ప్రతివారికీ అర్థమవుతోంది. నిజానికి ఆ ప్రాసెస్‌ని తనే కొత్తగా కనిపెట్టినట్లుగా చెప్పడమే అసలు పెద్ద అతిశయోక్తి. ఏమాత్రం కామన్‌సెన్స్ వున్న ప్రాజెక్ట్ మేనేజర్ అయినా ఆటోమేటిగ్గా చేసేయవలసిన బేసిక్ విషయాన్ని ఒక గొప్ప టెక్నిక్‌గా.. ఎవరూ ఇంతకుముందు ఉపయోగించి ఉండని కొత్త పద్ధతిగా అతను వర్ణించి చెప్తున్న తీరు అందరికీ చాలా ఇరిటేటింగ్‌గా వుంది.

అయినాసరే అతని ప్రెజెంటేషన్ అవగానే అందరం చప్పట్లు కొట్టి మెచ్చుకున్నాం.

తన కాబిన్ వైపు వెళ్తూ ప్రెజెంటేషన్ ఎలా వుందని అడిగాడు సుబ్బు. "చాలా బాగుంది" అన్నాను.

ఇంకో కొత్త అయిడియా వుందనీ... రెండు మూడు రోజుల్లో అది కూడా ప్రెజెంట్ చేయబోతున్నాననీ చెప్పాడు.

"డిసెంబర్ మహత్యమా" అన్నాను నేను నవ్వుతూ.

డిసెంబర్‌లో పెర్ఫార్మెన్స్ అప్రయిసల్ వుంటుంది. దానికి ఒకనెల ముందు నుంచీ యిలాంటి పనులు రెండు మూడు చేస్తే, రిపోర్ట్ మీద దాని ప్రభావం వుంటుంది. గ్రూప్ మేనేజర్ని ఎంతగా యింప్రెస్ చేస్తే అంతమంచి రిపోర్ట్ వస్తుంది కదా!

నా ప్రశ్నకి సుబ్బు పెద్దగా నవ్వాడు. "ఏదో ఒకటి చేయాలిగా మరి!" అన్నాడు.

అవును. ఏదో ఒకటి చేయాలి. నేనూ యిలాంటిదేదన్నా ఒకటి రెండు రోజుల్లో సృష్టించాలి. నా ప్రాజెక్టుని మాత్రం బ్రహ్మాండంగా చేసి కూర్చుంటే సరిపోదు. దానికి గుర్తింపూ, గౌరవం ఏమీ వుండదు. ఉద్యోగంలో నిజంగా వుపయోగపడేది యిలాంటి వుపయోగంలేని పనులే.

ఆ మాట అనుకోగానే నాకు రెండ్రోజుల క్రితం దివ్యతో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. ఆ రోజు శర్మగారి ప్రవచనాల గురించి దివ్య ఏదో గొప్పగా చెప్తుంటే... నేను

చిరాగ్గా "ఎందుకూ ఉపయోగపడని ఆ ఉపయోగం లేని పనుల గురించి నాకు చెప్పకు" అన్నాను.

దివ్య నవ్వుతూ "ఉపయోగపడని ఉపయోగం లేని పనులా! అదేమిటి?" అంది.

పొరపాటున అన్నా, ఆ తప్పు ఒప్పుకోకుండా నేను దానిని సమర్థించుకోవడానికి ట్రై చేశాను. "అంటే... ఒక్కోసారి కొన్ని పనులు నిజంగా వుపయోగంలేనివి అయినా మనకు ఏదోరకంగా వుపయోగపడతాయి. అంటే ఉదాహరణకి..." అని నేను ఎక్స్‌ప్లెయిన్ చేయబోతూంటే...

"అర్థమయింది లెండి మీ భావం" అంది దివ్య. "అంటే మన జీవితానికి పెద్దగా వుపయోగపడకపోయినా ప్రస్తుతానికి సంతృప్తినిస్తాయి. టైమ్‌పాస్ చేస్తాయి అలాంటి పనులు. అంతేకదా" అంది.

నేను తలూపాను. 'అమ్మో! నేను అనాలోచితంగా మాట్లాడిన మాటలకి కూడా ఓ అర్థముంది సుమా' అని ఆనందపడుతూ... "మరోరకంగా చెప్పాలంటే లాంగ్‌టర్మ్ బెనిఫిట్స్, షార్ట్‌టర్మ్ బెనిఫిట్స్ అని కూడా అనుకోవచ్చు..." అన్నాను గంభీరంగా, వాటిని సూత్రీకరిస్తూ.

దివ్య సాలోచనగా చూసి "ఇంకో రకంగా చెప్పాలంటే ఇహలోకంలో వుపయోగపడేవి... పరలోకానికి పనికొచ్చేవి అనొచ్చేమో" అంది.

"ఏమిటో అది! నాకర్థంకాలా" అంటూ నేను లేచి నిలబడ్డాను.

ఆ రోజు 'నాకర్థం కాలా' అని తేల్చేశాను కానీ... నిజానికి దివ్య అన్న మాటలు నాకు అర్థం కాకపోలేదు. నేను చెప్పిన పాయింట్‌కి ఎక్స్‌టెన్షన్ దివ్య చెప్పిన యిహమూ.. పరమూ.. ఇహం షార్ట్‌టర్మ్, పరం యింకొంచెం లాంగ్‌టర్మ్.

సుబ్బులాగా నేనూ ఏదన్నా చేయాలనుకున్నాను కానీ... ఏమీ చేయకుండానే రోజు గడిచిపోయింది. ఒంటిగంట నుంచి మూడున్నర దాకా మరో మీటింగ్. ఆ తర్వాత అయిదింటిదాకా నా మామూలు పని.

సరే. ప్రెజెంటేషన్‌వర్క్ గురించి యింట్లో కూడా ఆలోచించవచ్చు కదా... నిన్న ఎలాగూ లేట్ అయింది, యివాళన్నా కాస్త త్వరగా యింటికెళ్దామని బయల్దేరబోతుంటే టేబిల్ మీది ఫోన్ మోగింది... జర్మనీనుంచి నా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అమిత్.

"ఉన్నావా! వెంటనే కొత్త ప్రాజెక్ట్‌కి ఎఫర్ట్ ఎస్టిమేషన్ పంపించు. థామస్ అడుగుతున్నాడు" అన్నాడు.

"వెంటనే అంటే" అన్నాను.

"వెంటనే. ఒక హాఫ్ యాన్ అవర్‌లో".

"హాఫ్ యాన్ అవర్‌లో ఎస్టిమేషనా! దేనికి?" అన్నాను నేను విస్తుపోతూ.

"ఏమో తెలీదు. థామస్ అడుగుతున్నాడు. రఫ్ ఎస్టిమేషనే కదా. ఏదో ఒకటి పంపించు" అన్నాడు.

నాకు ఒళ్లు మండింది. "ఎప్పుడడిగాడు థామస్?" అన్నాను.

"ఇపుడే. టెన్ మినిట్స్ బాక్" అన్నాడు అమిత్ తడుముకోకుండా.

నాకు తెలుసు. నేను పూనుకుని చేయాల్సిన ఎస్టిమేషన్ అయితే కొంచెం పద్ధతిగా చేయాలి. అలాంటి రిపోర్ట్‌ని థామస్ యిలా అరగంటలో యిమ్మని అడగడు.

అమిత్ ఉజ్జాయింపుగా చెప్తే సరిపోయే విషయమయితేనే యిలా అరగంటముందు అడుగుతాడు. థామస్ ఏ రెండ్రోజుల కిందటో అడిగిన విషయాన్ని అమిత్ మర్చిపోయి ఆఖరి నిమిషంలోనైనా నాకు చెప్తూండి వుండాలి. లేదా అమిత్‌ని నోటిలెక్కతో చెప్పమని అడిగిన విషయాన్ని అతను నా మీదికి తోస్తూనైనా వుండాలి. రెండోదయితే నాకేం ప్రాబ్లం లేదు. మొదటిదయితేనే యిబ్బంది. నేను విషయం గ్రహించానని అమిత్‌కి అర్థమయిందేమో...

"నేను కూడా ప్రిపేర్ చేస్తాను బాస్. నువ్వు కూడా చేసివ్వు. ఇద్దరం విడివిడిగా చేసి కంపేర్ చేసుకుంటే బెటర్ కదా" అన్నాడు.

"సరే" అంటూ మళ్లీ కుర్చీలో కూలబడ్డాను. ఫోన్ పెట్టేసి కొత్త ప్రాజెక్ట్ గురించి వున్న వన్‌లైన్ స్టేట్‌మెంట్ ఓపెన్ చేశాను.

ఇది ఒక టెస్టింగ్ ప్రాజెక్ట్. కానీ టెస్ట్ చేయాల్సిన ఫీచర్స్ ఏమిటో అసలేమీ ఆలోచించలేదింతవరకూ. డిస్కస్ చేయడానికి టీమ్ మెంబర్స్ కూడా ఎవరూ లేరు. అందరూ తొందరగా వెళ్లిపోయారివాళ.

పేపర్ ముందు పెట్టుకుని "ఏం బాధర్రా బాబూ!" అనుకుంటూ పెన్సిల్ చేతిలోకి తీసుకుంటుంటే నా చెవుల్లో పొద్దున్న శర్మగారు చెప్పిన మాటలు వినిపించాయి. 'శారీరక బాధకి నాలుగు కారణాలు'. బుర్రలో ఏదో మెరుపు మెరిసింది.

ఆ నాలుగు కారణాలూ ప్రాజెక్ట్‌కి ఆపాదించి... వాటికి కావలసిన సొల్యూషన్స్ అన్నీ లిస్ట్ అవుట్ చేస్తే... ప్రాజెక్ట్ గురించి క్విక్‌గా ఒక అయిడియా వస్తుందేమో అనిపించింది.

మొదటి కారణం వ్యాధి. అంటే అడ్డం పడడం. దాన్ని ప్రాడక్ట్‌కి ఆపాదిస్తే... సరిగా పనిచేయకపోవడం. ప్రాడక్ట్ ఫెయిలయ్యే రకరకాల అవకాశాలనీ... వాటిని కనిపెట్టటానికి కావలసిన టెస్ట్ కేసెస్‌నీ క్లుప్తంగా రాశాను. రెండో కారణం శ్రమ. అంటే ఓవర్లోడ్. అలాగే మూడో కారణం... నాలుగో కారణం... యిలా అన్నిటినీ ప్రాజెక్ట్‌కి ఆపాదించి, వాటిని కనిపెట్టడానికి ఎన్ని టెస్ట్ కేసెస్ కావాలో రాస్తే... పదినిమిషాల్లోనే మంచి లిస్ట్ తయారయింది. ఎయిటీపర్సెంట్ దాకా కవర్ అయ్యాయనిపించింది.

క్విక్‌గా ఎస్టిమేషన్ తయారుచేసి మెయిల్ చేశాను సరిగ్గా థర్టీ మినిట్స్‌లో.

'అమిత్‌కి ఫోన్ చేసి, మెయిల్ చూసుకోమని చెప్పి బయల్దేరదాం' అనుకుంటూండగానే.. ఫోన్ గణగణా మోగింది.

"ఎప్పుడు తయారుచేసి పెట్టావు బాస్ యింత డీటైల్డ్ రిపోర్ట్!" అన్నాడు అమిత్ వుద్వేగంగా.

"తయారుచేసి పెట్టలేదు. ఇపుడు నువ్వు అడిగాకే ప్రిపేర్ చేశాను" అన్నాను.

"డోంట్ టెల్ మి" అన్నాడు అమిత్. "కొంత వర్క్ యిదివరకే చేసుంటావ్. నాకు తెలుసు. ఎనీవే థాంక్యూ. థామస్ కూడా యింత డీటైల్డ్‌గా ఎక్స్‌పెక్ట్ చేసుండడు" అన్నాడు.

"నువు ఎస్టిమేట్ చేసిన వాల్యూ ఎంత?" అన్నాను నేను అతని దూకుడుకి అడ్డం వస్తూ.

అమిత్ నవ్వాడు. "ఎక్కడ! ఎలా మొదలుపెట్టాలా అని నేను తడుముకుంటూండగానే నువు ఫైనల్ రిపోర్ట్ పంపించేశావు. నేను నీ అంత ఫాస్ట్ కాదు" అన్నాడు.

నేను చిరునవ్వుతో ఫోన్ పెట్టేసి యివతలికి వచ్చాను. కారు స్టార్ట్ చేసి ఆఫీస్ గేటు దాటుతూంటే అమిత్ గొంతులోని ఎక్సైట్‌మెంట్ నా చెవుల్లో మరోసారి మారుమ్రోగింది.

నిజంగానే పదినిమిషాల్లో అంత చక్కటి రిపోర్ట్ తయారవడం... చిన్న అయిడియాతో అన్ని పాయింట్లు అంత వేగంగా తోచడం... నాక్కూడా అద్భుతంగా అనిపిస్తోంది.

ఒక్క అయిదు నిమిషాలు అలవోకగా విన్న శర్మగారి ప్రవచనంలో నుంచి వచ్చిన అయిడియాతో ఈ అద్భుతం జరిగిందనుకుంటే అది యింకా చిత్రంగా అనిపిస్తోంది.

నేను ఉపయోగపడని విషయం అనుకున్నది యింత బాగా ఉపయోగపడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

నిజానికి నేను దీనిమీద ఒక రిపోర్టు తయారుచేసి సుబ్బులాగా ప్రెజెంట్ కూడా

చేయొచ్చు. అప్పుడు అందరినుంచీ ఎంత మంచి ప్రశంసలు వస్తాయో వూహించుకుంటే నా నరనరంలోనూ వుత్సాహం నిండింది. గుండెలనిండా గాలి పీల్చి వదులుతూ ఆనందంగా నవ్వుకున్నాను. రాత్రికి కూర్చుని రిపోర్ట్ తయారుచేయాలి అనుకున్నాను.

నేను యింటిముందు కారు ఆపిన శబ్దం విని కాబోలు... పక్క యింట్లోంచి దివ్య కేకపెట్టింది. "ఏమండీ... యిక్కడున్నా" అంటూ.

"తొందరగా వచ్చేశారే" అంటూ రెండు యిళ్లమధ్యా వున్న గోడ దగ్గరికి వచ్చింది. "ఇదిగో కీ తీసుకోండి. నేను పదినిమిషాల్లో వస్తాను. ఈ లోపు డ్రెస్ మార్చుకోండి" అంది.

నేను గోడ దగ్గరికి నడిచి కీ అందుకున్నాను. దివ్య మళ్లీ లోపలికి వెళ్లిపోతుంటే... మా యింట్లోకి వెళ్లేందుకు వెనుతిరగబోయిన నేను వులిక్కిపడ్డాను.

ప్రహరీగోడకి అటుపక్కన నాకు అడుగుదూరంలో జామచెట్టు... కొన్ని కొమ్మలు యిటు నా తలపైకి, కొన్ని కొమ్మలు వాళ్లింటివైపుకి.

నేను రోజూ చూసే జామచెట్టు!... కిందనుంచి చూస్తే యిలా వుంటుందా ఈ చెట్టు!! ఇన్నాళ్ళూ పైభాగాన్ని మాత్రమే చూసిన నాకు.. ఇలా క్రింద నిలబడి తల పైకెత్తి దాన్ని చూడటం తమాషాగా అనిపించింది.

ఇక్కడ్నుంచి... యిలా కిందనుంచి చూస్తుంటే ఎంత అద్భుతంగా వుంది ఈ చెట్టు! నోరూరిస్తూ కాయలు... వాటినుండి వస్తున్న మంచి వాసన... కొమ్మల మీది పిచ్చుకల సవ్వడి... కాండం మీద గెంతులేస్తున్న ఉడుతపిల్లా... అడుగుదూరంలో నిలబడి చూస్తేనే కళ్లనీ... కడుపునీ నింపేస్తోంది. పంచేంద్రియాలనీ అమ్మలా జోకొట్టి నిద్రపుచ్చుతోంది.

నా కనుకొలకుల్లో నీరు నిలవడం... మనసు దూదిపింజలా తేలికవడం నాకు తెలుస్తోంది. ఇన్నాళ్లనుంచి దాన్ని అంత దగ్గరగా చూస్తున్నా... దాని ఔన్నత్యాన్నీ... అది యివ్వగల ఆసరానీ... రక్షణనీ... ఉపయోగాన్నీ గుర్తించలేకపోయినందుకు ఒకవైపు దుఃఖం, మరోవైపు గురుత్వాన్ని అర్థం చేసుకోవాలంటే ఎక్కడ నిలబడాలో అర్థమైన ఆనందం.

అతిశయోక్తులు, ఆత్మస్తుతుల మేడపై నిద్రిస్తున్న నాకు మెలకువ వచ్చింది. సూర్యుడికి నేనే దగ్గరగా వున్నానన్న భ్రమనుంచి మేల్కొలిపి సూర్యోదయాన్ని చూపగల గురువు దర్శనమయింది.

**- ఆదివారం ఆంధ్రజ్యోతి**

*10 జనవరి 2010*